క్లుప్తంగా

రైతులకు కొత్తరుణాలు ఇవ్వాలి

దామరగిద్ద: ప్రభుత్వం పంట రుణమాఫీచేసిన రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగులప్ప, జిల్లా విద్యుత్ ప్రముఖ్ మహిపాల్ అన్నారు. శనివారం మండలంలోని బీకేఎస్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు రుణమాఫీని త్వరగా పూర్తిచేయాలన్నారు. రుణమాఫీ చేసిన రైతులకు తిరిగి కొత్తగా పంటరుణం ఇచ్చేలా బ్యాంకర్‌లను ఆదేశించాలన్నారు. కార్యక్రమంలో హన్మంతు, వెంకట్రాములు, సత్యనారాయణ, కిష్టప్ప, మైపాల్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

ఊట్కూర్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఎంపీడీఓ రమేశ్‌కుమార్ అన్నారు. శనివారం చిన్నపోర్ల ఉన్నతపాఠశాల విద్యార్థులు నో బ్యాగ్ డే సందర్భంగా పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణంపై సంపూర్ణ అవగాహన పెంచుకుని పర్యావరణ పరిరక్షణ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు పల్లెప్రకృతి వనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సింహారాజ, హెచ్‌ఎం నర్సింహ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి జాతర

నారాయణపేట రూరల్ : మండలంలోని తిర్మలాపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో జాతర మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ పురవీధుల గుండా స్వామివారి పల్లకీసేవా నిర్వహించి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంకట్రాములు

నారాయణపేట: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పేట మండలం కొల్లంపల్లికి చెందిన సీనియర్ నాయకులు అవుసలి వెంకట్రాములును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు , కేంద్ర మంత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన ఇప్పటివరకు మండల పార్టీ అధ్యక్షుడిగా, జిల్లాస్థాయిలో వివిధ పదవుల్లో కొనసాగి పార్టీకి సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీపటిష్టతకు కృషి చేస్తానన్నారు.

స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా కనకరాజ్

మాగనూర్: మండల బీజేపీ సీనియర్ నాయకులు ఉజ్జెల్లి కనకరాజ్‌ను బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనకు బీజేపీ స్టేట్ కౌన్సిల్‌మెంబర్‌గా నియమించినందుకు స్టేట్ పార్టీ, జిల్లా, నియోజకవర్గ కార్యవర్గసభ్యులు కొండయ్య, జలంధర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

నర్వ: ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పనితీరుపై విద్యార్థులకు క్షేత్ర సందర్శనను చేపట్టినట్లు హెచ్‌ఎం రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్, విద్యాశాఖ కార్యాలయం, గ్రంథాలయం, విండో కార్యాలయం, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలను విద్యార్థులకు చూపించారు. ఆయా కార్యలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలను అధికారుల ద్వారా, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, గోవిందు, పీఈటీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయం

మరికల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, మండల అధ్యక్షుడు వీరన్న అన్నారు. శనివారం మండలంలోని వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారన్నారు. అధికార పార్టీ అన్నిరంగాల్లో పూర్తిగావిఫలం కావడంతో ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నరని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు. రామకృష్ణ, సత్యన్న, మొగులప్ప, రఘు, తిర్మలయ్య పాల్గొన్నారు.

శివకుమార్‌రెడ్డికే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

నారాయణపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పేట కాంగ్రెస్ అభ్యర్థిగా పోటిచేసేందుకు కుంభం శివకుమార్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు అధిష్టానానికి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో చేసిన పోరాపాట్లను మళ్లీ చేయకుండా ఖచ్చితంగా గెలిచే శివకుమార్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని కోరారు. అన్ని సర్వేలు శివకుమార్‌రెడ్డికి అనూకూలంగా ఉన్నయన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సదాశివారెడ్డి, ఎండి సలీం, యూసుఫ్, గోపాల్‌రెడ్డి, మహిమూద్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ, తదితరులు



ఊట్కూర్‌లో

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



నర్వలో మొక్కలు నాటుతున్న విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న

కోస్గి: హరితహారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై విరివిగా మొక్కలు నాటాలని జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో శనివారం చేపట్టిన ప్రత్యేక హరితహారంలో భాగంగా మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ ఆవరణలో మొక్కలునాటే కార్యక్రమం నిర్వహించారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాళప్ప, ఎంపీఓ రహమత్, ఏపీఓ మాదవరెడ్డి, ఉప సర్పంచ్ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.

మద్దూరు: ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం 5 మొక్కలను నాటి వాటిని పెంచాలని ఎంపీపీ విజయలక్ష్మి సూచించారు. శనివారం కోటి మొక్కల మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ అరుణతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు ఒక మొక్కను ఎంపిక చేసుకొని పెంచాలని సూచించారు. అలాగే నందిపాడ్ నర్సరీ స్థానిక సర్పంచ్ సైదమ్మతో కలిసి ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి 800 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లు మొక్కలు నాటారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి, ఎంపీటీసీ వెంకటయ్య, ఉపాధి ఏపీఓ నాగరాజు, ఈసీ జేపీ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో శనివారం హరితహార కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీలు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, ఏపీఓ సిద్దేశ్వర్, కార్యాదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: గ్రామంలోని ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలునాటి పెంచాలని సర్పంచ్ శంకరమ్మ అంజప్పగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇంటింటికీ ఐదుమొక్కలు చొప్పున పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ సుదర్శన్, నాయకులు రాజప్పగౌడ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం పాటుపడుదామని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వం చేపట్టిన కోటిమొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒకేరోజూ కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్, ఎంపీడీఓ రమేశ్‌కుమార్, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఈసీ శ్రీనివాస్, కార్యదర్శి సుమలత, ఉప సర్పంచ్ ఇబాదుర్ రహిమాన్ పాల్గొన్నారు.

నర్వ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం ద్వారా గ్రామాలన్ని పచ్చబడాలని విండో వైస్‌చైర్మన్ లక్ష్మన్న అన్నారు. శనివారం పెద్దకడ్మూర్‌లో నిర్వహించిన హరితహారంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవిందు, గ్రామస్తులు జగన్‌మోహన్‌రెడ్డి, కిరణ్ ప్రకాష్‌రెడ్డి, వెంకటయ్య, సత్యం పాల్గొన్నారు.

చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను నెరవేరుస్తా

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి తన సతీమణి చిట్టెం సుచరితకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

కృష్ణా: దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను నెరవేరుస్తామని తనయుడు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చిట్టెం నర్సిరెడ్డి జయంతి సందర్భంగా శనివారం టైరోడ్‌లోని నర్సిరెడ్డి విగ్రహానికి ఆయన సతీమణి చిట్టెం సుచరితతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య కేక్‌కట్‌చేసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సతీమణి చిట్టెం సుచరిత, వైస్ ఎంపీపీ ఈశ్వరప్పగౌడ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింగౌడ్,రాజేష్‌గౌడ్,శ్రీనివాస్‌గుప్త, విజయగౌడ, మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మోనేష్, శివరాజ్‌పాటేల్,శివప్ప, ఆంజనేయులు, పాల్గొన్నారు.

నారాయణపేట: మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి జయంతిని జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు సీఎన్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. సుధాకర్, సదాశివారెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, హన్మంతు, సలీం, శరణప్ప, రమేశ్ పాల్గొన్నారు.

మాగనూర్: దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి జయంతిని పురష్కరించుకొని శనివారం మండలంలోని వర్కూర్‌కు చెందిన రామకృష్ణరెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం వాటర్ బాటీళ్లు, స్కూల్‌బ్యాగ్స్ పంపిణీచేశారు. సర్పంచ్ నిర్మలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, సర్పంచ్ రాజు, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

నర్వ: మండంలోని కల్వాల్ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ప్రాసీడింగ్‌లను అందజేశారు. ఎంపీపీ జయరాములు శెట్టి, సర్పంచ్ మహేశ్వరమ్మ, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ అంపయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, కిరణ్‌ప్రకాష్ రెడ్డి, కల్వాల్ ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

మాగనూర్: మండల ఎంపీడీఓగా శశికళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మద్దూరు నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల సమస్యల పరిష్కారానికి అన్నివిధాలా కృషి చేస్తానని, నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సహకరించాలని ఆమె కోరారు.

మద్దూరు: మండల ఎంపీడీఓగా సుధాకర్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసే శశికళ మాగనూరు మండలానికి బదిలీపై వెళ్లడంతో మాగనూరు మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సుధకార్‌రెడ్డి బదిలీపై ఇక్కడి వచ్చారు.

మక్తల్: మండల ఎంపీడీఓగా సద్గుణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ధన్వాడలో ఎంపీడీఓగా పని చేస్తున్న సద్గుణ ఇక్కడికి ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

కోస్గి: ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన అధికారుల బదిలీల్లో భాగంగా కోస్గి మండల నూతన ఎంపీడీఓగా కాళప్ప బదిలీపై వచ్చారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ వెంకటయ్య పేటకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓగా కాళప్ప శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం..

దామరగిద్ద: మండల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఈఓ ఉదయ్‌శంకర్‌ను ఎంపీపీ నర్సప్ప ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కన్కిరెడ్డి, బసంత్‌రెడ్డి నర్సప్ప, వెంకట్‌రెడ్డి, భీంరెడ్డి, రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- కర్ణాటక ఎమ్మెల్యే చెన్నబసప్ప



శివమొగ్గ ఎమ్మెల్యే చెన్న బసప్పను సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట: పార్టీ పటిష్టత రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు మాజీ ప్రజాప్రతినిధులు పాత్ర కీలకం కావాలని కర్ణాటక ఎమ్మెల్యే శివమొగ్గ చెన్నబసప్ప అన్నారు. ప్రవాస్ యోజనలో భాగంగా ఆయన శనివారం పేట నియోజకవర్గంలో పర్యాటించారు. ఈ సందర్భంగా బూత్‌స్థాయిలో పర్యాటించి పార్టీ ముఖ్యనాయకులు, క్యాకర్తలతో మాట్లాడారు. మాజీలు ఇంటికే పరిమితం కాకుండా పార్టీ పటిష్టతకు కృషిచేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మీ అనుభవం పార్టీ విజయంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ జీకే నర్సింహులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందునామాజీ, కౌన్సిలర్లు కమల బాయి, రాఘవేంద్ర, నాయకులు మాణిక్ నగరి, అంబాదాస్‌నగరి, ఉమాకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న దంపతులు

మక్తల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముందుగా పడమటి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నూతన బొడ్రాయి పుష్కర నీటిని తీసుకొచ్చి పుష్కర స్నానం చేయించి అభిషేకం, ధాన్యం, పాలతో అభిషేకం చేశారు. పలువురు దంపతులు కూర్చొని హోమం నిర్వహించారు. మొదట పడమటి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని వినాయకనగర్, డొంగుల ఆంజనేయ సామి ఆలయం, బాలాంజనేయస్వామి ఆలయ వెనక కోనేరు దగ్గర నాలుగు చోట్ల బొడ్రాయి ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, రాష్ట్ర ట్రేడ్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవరి మల్లప్ప, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి, మాజీ ఎంపీపీలు కొండయ్య, చంద్రకాంత్‌గౌడ్, బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, రాజేష్‌గౌడ్, బీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే జన్మసార్థకత

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికంగా ఉన్నప్పుడే జన్మసార్థకమవుతుందని అర్చకుడు సిద్ధరామయ్యస్వామి అన్నారు. శనివారం ఉమహేశ్వర ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా ఉమామహేశ్వరులకు లక్ష బిల్వార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహేష్, చెన్నబసవస్వామి, శంకర్‌స్వామి, ఆంజనేయులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికిగాయాలు

మరికల్: ఆగిన బైక్‌ను వెనకనుంచి కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైయ్యాయి. మండలంలోని అప్పంపల్లికి చెందిన బోయశ్రీనివాస్ శనివారం మరికల్ నుంచి గ్రామానికి బైక్‌పై వచ్చి గ్రామ స్టేజీ వద్ద బైక్‌ను నిలుపుతుండగా వెనకల నుంచి పేట మండలం జాజాపూర్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అంబులైన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రోగుల సమస్యలు శ్రద్ధగా వినాలి

మాగనూర్: రోగుల సమస్యలు శ్రద్ధగావినాలని నేషనల్ టీమ్ అధికారి డాక్టర్ అనుజ్‌శర్మ, డాక్టర్ సిల్వ కూమార్ అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని రెండో రోజూ జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యలతో వచ్చే రోగులను మర్యాద పూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలు తెలుకుని వైద్యం అందించాలని సూచించారు. ప్రతి పనికూడా రికార్డురూపంలో ఉండాలని సిబ్బందికి తెలిపారు. మండల వైద్యాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీఉనత్న పాఠశాల విద్యార్థులకు శనివారం ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. అదేపాఠశాలలో 1992–93బ్యాచ్‌లో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు సొంతంగా డబ్బులను జమచేసి ఎంఈఓ గోపాల్‌నాయక్ చేతుల మీదుగా అందించారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, కెంచె శ్రీనివాస్, హెచ్‌ఎం రవికుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ.

మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామానికి చెందిన రాకేష్ అనే యువకుడు పొలం వద్ద మోటార్ ఆన్‌చేస్తు స్టార్టర్ దగ్గర విద్యుదాఘాతంతో గతనెల మృతి చెందాడు. అయితే అతడి జన్మదినం సందర్భంగా స్నేహితులు అతడిని గుర్తు చేసుకుంటూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్, ప్యాడ్లను పంపిణీ చేశారు. మహేష్, వినోద్, నోరుద్దిన్ అల్తాఫ్, కిట్టు, గురు, ప్రకాష్‌గుడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణపేట: అనారోగ్యం బారిన పడిన ఇద్దరికి శనివారం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందు నామాజీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన అజయ్ చామకుర రూ. 30 వేలు, మండలంలోని జాజాపూర్‌కి చెందిన లక్ష్మణ్‌కు రూ.17,500 చెక్కును అందజేశారు. ఎంపీటీసీ ప్రభాకర్, రాము, కో –శాధికారి హన్మంతురావు, అంబాదాస్ నగరి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

దామరగిద్ద: మండలంలోని పిడెంపల్లి గ్రామానికి ఆర్టీసీబస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దాదాపు 2గంటల పాటు రాస్తారోకో చేపట్టగా వాహన రాకపోకలు స్తంభించాయి. దీంతో డీఎం లక్ష్మీసుధతో ఫోన్‌లో మాట్లాడారు. బస్సు సదుపాయం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్జిలను కలిసిన ఎస్‌ఐ

నారాయణపేట రూరల్: జిల్లాలో ఇటీవల రూరల్ పీఎస్ నూతనంగా ఏర్పడిన సందర్భంగా శనివారం కోర్టులో జడ్జిలను ఎస్‌ఐ జయప్రసాద్ మొక్కఅందించి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్, జెఎంఎఫ్‌సీ కోర్టుజడ్జి మహ్మద్ ఉమర్, అడిషనల్ జూనియర్ సివిల్, జెఎంఎఫ్‌సీ కోర్టు జడ్జి సయ్యద్, జకియా సుల్తానాలను కలుసుకుని రూరల్ పీఎస్ పరిధి, వివిధ అంశాలను వివరించారు.

ఓటరుగా నమోదుచేసుకోవాలి



వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి: 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఈమేరకు శనివారం చేపట్టిన ప్రత్యేక ఓటునమోదులో భాగంగా పట్టణంలోని పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లనమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పరిశీలించారు. మండల పరిధిలోని ఆయాగ్రామాల పోలింగ్‌బూత్‌లను పరిశీలించి గ్రామాల్లో అర్హులకు ఓటర్లుగానమోదు చేసే బాధ్యత బీఎల్‌ఓలదేనన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుభాష్‌రెడ్డి, బుగ్యాసాబ్, హన్మంతుతో పాటు ఆయా పోలింగ్‌బూత్‌ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఏర్పాటుచేసిన ఓటునమోదు ప్రత్యేక శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, బీఎల్‌ఓలు బీంరావు, రమాదేవి, జయదేవి, వెంకటేశ్వరమ్మ, పార్వతమ్మ, జ్యోతి, పుష్పమ్మ పాల్గొన్నారు.

ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం



సమ్మెలో నినాదాలు చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

నారాయణపేట: ఏఎన్‌ఎంల నోటిఫికేషన్ రద్దుచేసి ఎలాంటి షరతులు లేకుండా బేషరతుగా రెగ్యులర్ చేయాలని లేనిపక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. 11వరోజూ సమ్మెలో భాగంగా శనివారం మున్సిపల్‌పార్కు ఎదుట నిర్వహించిన సమ్మెలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కరోనా సమయంలో ఏఎన్‌ఎంలను దేవుళ్లతో సమానంగా పోల్చారని ఇప్పుడు వాళ్లని చిన్న చూపు చూస్తూ పట్టించుకోవడం బాధకరమైన విషయమన్నారు. ఇరవైఏళ్లుగా చాలిచాలని వేతనాలతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ఏఎన్‌ఎంలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతిరోజూ 34రకాల ఆన్‌లైన్‌లో వర్క్ చేస్తూ ఏఎన్‌ఎంలు అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైందికాదన్నారు. అందరికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సవిత, రాణి, శోభ, భారతి, లక్ష్మి, మంజుల, సుజాతరాణి, దేవిక, స్వరూప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డీడీలు కట్టిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేయాలి

మద్దూరు: రెండోవిడత గొర్రెల పంపిణీలో డీడీలు కట్టిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని చింతల్‌దిన్నె లబ్ధిదారులు స్థానిక పశువైద్యశాల ఎదుట ధర్నాచేశారు. చింతల్‌దిన్నెలో మొదటి విడతలో 74మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేపట్టారు. రెండో విడతలో మరో 76మందికి గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉంది. వీరందరి నుంచి అధికారులు 25శాతం మేరకు డీడీలు కట్టించుకున్నారు. పంపిణీ మాత్రం 12మందికి మాత్రమే చేయడంతో మిగిత వారు ఆందోళన చేపట్టారు. 12మందికి సంబంధించిన గొర్రెలు, పోట్టేళ్లు గ్రామానికి రావడంతో గొర్రెలు రాని లబ్ధిదారులు గొడవకు దిగారు. ఈ క్రమంలో లబ్ధిదారులందరూ ఇక్కడివచ్చి ధర్నా చేపట్టారు. దీంతో పశువైద్యాధికారి రాఘవేందర్‌గౌడ్ 12మంది పేర్లపైనే గొర్రెలు మంజూరైయ్యాయి. మిగిలిన వారికి విడతలవారీగా వస్తాయని నచ్చజెప్పిన వినకపోవడంతో డాక్టర్‌పై ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఫోన్‌లో అతిత్వరలో మరో 24మందికి, మరికొన్ని రోజుల్లో మిగిలిన వారికి పంపిణీ చేస్తామని వారికి ఫోన్‌లో హామీఇవ్వడంతో ధర్నా విరమించారు.

వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమం పరిశీలన



సామర్థ్యాలను పరిశీలిస్తున్న పర్యవేక్షకుడు

మద్దూరు: వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమాన్ని జిల్లా పర్యవేక్షకులు శనివారం మండలంలోని నిడ్జింత, భూనీడ్, దోరేపల్లి, నాగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలు, మద్దూరు బాలికల ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యాసమిత్ర 45 రోజుల సంసిద్ధత బోధన ఏ విధంగా కొనసాగుతుందని విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బృందం సభ్యులు రాజునాయక్, వీరమల్లేష్, జానకిరాములు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు మరవలేనివి



మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలవేస్తున్న సురేఖ

మరికల్: సమాజ సేవకోసం తన జీవితాన్ని అకింతం చేసిన మదర్‌థెరిసా సేవలు మరవలేనివని జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, సర్పంచ్ గోవర్ధన్ అన్నారు. శనివారం మదర్‌థెరిసా జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుచ్చప్ప, శేఖర్, రాజమణెమ్మ, రామస్వామి, రాములు, తిరుపతయ్య, బాలస్వామి, సుధాకర్‌గౌడ్, రామకృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు రూ.18వేలు ఇవాలి



మాగనూర్‌లో ఇన్‌చార్జి తాహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట: ఆశాకార్యకర్తలకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని కోరుతూ శనివారం పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలమణి మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు రూ. 18 వేలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అధికారి సురేశ్‌కు అందజేశారు. భాగ్యమ్మ, ఉమ, రాధిక, నర్సమ్మ, విజయలక్ష్మి, అంజమ్మ, కృష్ణవేణి, జయమ్మ పాల్గొన్నారు.

ఊట్కూర్: ఆశాకార్యకర్తలకు కనీసవేతనం రూ. 18వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేసి తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నారాయణ, పద్మ, ఆకాశవాణి, విజయలక్ష్మి, శాంతమ్మ, సూరమ్మ, ప్రియంక పాల్గొన్నారు.

మాగనూర్: కనీసవేతనం రూ.18 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ పుంజనూర్ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు.

మరికల్: ఆశాకార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శనివారం వారు మండలంలోని ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ లతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు కాశప్ప మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు కనీసవేతనం రూ. 18వేలు ఇవ్వాలని, అలాగే పెండింగ్‌లోసమస్యలను పరిష్కరించాలన్నారు.

నర్వ: ఆశా కార్యకర్తలకు కనీసవేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ గోవింద్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అధ్యక్షురాలు పద్మ, శివలింగమ్మ, లక్ష్మీ, అంజమ్మ, లలిత, మణెమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.